సాక్షి
నంద్యాల
శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం కర్నూలుకు చెందిన జస్వంత్‌కుమార్ రూ.1,00,116లు విరాళంగా అందజేశారు.



970 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి 970 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. డ్యాంలో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



భగవద్గీత గ్రంథాల పంపిణీ

శ్రీశైలంటెంపుల్: స్వర్ణ యుగ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ చేతుల మీదుగా శ్రీశైలంలో విద్యార్థులకు, భక్తులకు 100 భగవద్గీత గ్రంథాలను గురువారం పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

'ఆడుదాం ఆంధ్ర' క్రీడా వస్తువుల పరిశీలన



క్రీడా వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల: జిల్లాలో త్వరలో ప్రారంభమయ్యే 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల వస్తువులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. గురువారం కలెక్టరేట్ చాంబర్‌లో క్రీడా పోటీలకు సంబంధించి క్రికెట్, వాలీ బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించిన వస్తువులను పరిశీలించారు. త్వరలో ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించిన క్రీడా వస్తువులను జిల్లాలోని 410 గ్రామ సచివాలయాలు, 106 వార్డు సచివాలయాలకు పంపిణీ చేయాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజును కలెక్టర్ ఆదేశించారు.

నేడు ఉయ్యాలవాడలో జగనన్నకు చెబుదాం - స్పందన

ఉయ్యాలవాడ: ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం – స్పందన' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కలెక్టర్ మన్‌జీర్ జిలానీ శామూన్, జిల్లా స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల: ప్రజాసేవలో రాణిస్తున్న ప్రఖ్యాత ఎన్‌జీఓ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసే వైఎస్సార్ అవార్డులు –2023 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు, వృద్ధులు, పిల్లల అభ్యున్నతికి పదేళ్లు అంతకంటే ఎక్కువ కాలం పాటు ఆదర్శప్రాయమైన సేవలు అందిస్తున్న ప్రముఖ ఎన్‌జీఓ సంస్థలు అవార్డులకు అర్హత అని పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీలోగా సంబంధిత మండల తహసీల్దార్ల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని డీఆర్‌ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

డిసెంబర్ వరకు సాగునీరు



తెలుగు గంగ కాల్వలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటరమణ

శిరివెళ్ల: తెలుగు గంగ ఆయకట్టుకు వారబందీ పద్ధతిలో డిసెంబర్ మొదటి వారం వరకు సాగు నీరు అందించవచ్చునని ఎస్ఈ వెంకట రమణ అన్నారు. గురువారం మహదేవపురం ప్రాంతంలో తెలుగుగంగ ప్రధాన కాల్వలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుగంగ కింద సాగైన పంటల రక్షణకు నీరు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాల్వ పరిధిలో 62 కిలో మీటర్ల వరకు సాగునీరు అందుతుందన్నారు. ఆయకట్టు పరిధిలో గతేడాది 60 వేల ఎకరాల్లో పంటలు సాగు కాగా.. ఈ ఏడాది 40 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారన్నారు. మహానంది మండలం, బండి ఆత్మకూరు మండలాల్లో రైతులు ఎక్కువగా వరి, ఇతర పంటలు, ఆళ్లగడ్డ ప్రాంతంలో బోరు బావుల కింద వరి సాగు చేశారన్నారు. వెలుగోడు రిజర్వాయర్‌లో మొదట 9.5 టీఎంసీలు నీరు ఉండంగా ప్రస్తుతం 5.5 టీఎంసీలు ఉందన్నారు. ఆయన వెంట డీఈఈ రవీంద్ర ఉన్నారు.

856 అడుగులుగా శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం గురువారం సాయంత్రానికి 856 అడుగులకు చేరుకుంది. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహం శ్రీశైలానికి పూర్తిగా నిలిచిపోయింది. బుధవారం నుంచి గురువారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 11,114 క్యూసెక్కుల నీరు విడుదలైంది. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 3.127 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి ఉత్పాదన అనంతరం నాగార్జున సాగర్‌కు 6,016 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1000 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,270, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,688 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 94.4570 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఉయ్యాలవాడలో ఈ - క్రాప్ నమోదును పర్యవేక్షిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు (ఫైల్)



పంటకు భరోసా కల్పించి కర్షకుడి కష్టాలు తీర్చి!

రైతుకు విత్తు నుంచి పంట విక్రయం వరకు ఎన్నో సమస్యలు ఎదురవుతూ ఉంటాయి.. వీటన్నింటినీ తొలగించేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రాప్ నమోదును పకడ్బందీగా చేపడుతోంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే బీమా ప్రీమియం చెల్లించకుండానే పరిహారం అందజేస్తోంది. మార్కెట్లో ధరలు పడిపోయిన సందర్భంలో 'మద్దతు' ఇస్తోంది. ఈ క్రాప్ ఆధారంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతుకు భరోసా ఇస్తోంది.



పైసా కట్టకుండానే రూ. 3.80 లక్షలు

చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు పాదం శ్రీనివాసులు. మండల కేంద్రం దొర్నిపాడుకు చెందిన ఇతను గతేడాది సుమారు 29 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. వాతావరణం మార్పులతో దిగుబడి బాగా తగ్గి నష్టం వచ్చింది. అయితే వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద ప్రభుత్వం రూ 3.80 లక్షలు అందజేసింది. గతంలో చేతి నుంచి ఇన్సూరెన్స్ డబ్బులు కట్టినా ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు పైసా చెల్లించకుండానే రూ 3.80 లక్షలు అందాయి. అన్నదాతకు అండగా నిలుస్తున్న జగనన్నకు రుణపడి ఉంటామని రైతు అంటున్నాడు.

- పక్కాగా.. పారదర్శకంగా ఈ - క్రాప్
- జిల్లాలో లక్ష్యానికి మించి నమోదు
- 5,21,568 ఎకరాల్లో పూర్తి
- ఈ - కర్షక్ యాప్‌తో నూతన షెడ్యూల్
- అన్నదాతలకు అన్ని రకాల ప్రయోజనాలు

ఆళ్లగడ్డ: పంట నష్టపరిహారం.. వైఎస్సార్ ఉచిత పంటల బీమా .. పంట రుణాలు.. సున్నా వడ్డీ.. కనీస మద్దతు ధర.. ఇలా విత్తు నుంచి విక్రయం వరకూ ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందాలన్నా 'ఈ-క్రాప్' నమోదు కీలకంగా మారింది. గతంలో కొంత మంది రైతులకు సరైన అవగాహన లేకపోడంతో రాయితీలు పొందలేక పోయారు. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఊరూరా ఈ - క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పక్కాగా పారదర్శకంగా చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 28 మండలాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు లక్ష్యం 5,88,181 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 5,10,925 ఎకరాల్లో వివిధ పంటల సాగైనట్లు అధికారుల అంచనా. అయితే ఈ ఖరీఫ్ సీజన్ గడువు ముగిసే సరికి 5,21,568 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేశారు. సాధారణ సాగుకంటే అత్యధికంగా ఈ-క్రాప్ నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలకు నాంది పలికి అర్హులు నష్టపోకుండా సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీ చర్యలు చేపట్టింది. గతంలో ఏయే సర్వే నంబర్లలో ఎంత మంది రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారో ఎంపీఈఓలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించేవారు. ఈ-క్రాప్ నమోదు చేసే విధానంలో యాప్‌లో సర్వే నంబర్ నమోదు చేసి ఏదో ఒక పొలం వద్ద రైతును నిలబెట్టి ఫొటో తీసేవారు. రైతు చెప్పింది మాత్రం నమోదు చేయడం చేసేవారు. ఫలితంగా ఏ మేరకు సాగవున్నాయో పూర్తి స్థాయిలో స్పష్టత ఉండటంలేదని గుర్తించిన ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. గ్రామ వ్యవసాయ సహాయకుల ట్యాబ్‌లో ఈ - కర్షక్ యాప్ అనే నూతన సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేసింది. నూతన విధానంలో గ్రామ వ్యవసాయ సహాయకులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించి మాత్రమే నమోదు చేయాల్సి వచ్చింది.



ఈ-క్రాప్ నమోదు సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవిస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

గడువు పెంచి అండగా నిలిచి..

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆగస్టు 15వ తేదీన ఈ క్రాప్ నమోదును ప్రారంభించారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. అయితే నంద్యాల జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల వివరాల నమోదు మొదట కొంత జాప్యం ఏర్పడింది. సకాలంలో వర్షాలు లేకపోవడం, వరి నాట్లు నెమ్మదిగా సాగడంతో లక్ష్యాన్ని చేరుకోలేక పోయారు. పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగించడంతో లక్ష్యానికి మించి చేశారు.

నమోదు కాకుంటే ఎరుపు.. నమోదైతే పసుపు..

నూతన విధానంలో మండల వ్యవసాయాధికారులు సర్వే నంబర్లను వెబ్‌ల్యాండ్ నుంచి డౌన్‌లోడ్ చేసి గ్రామ వ్యవసాయ సహాయకులకు కేటాయిస్తే వారు ఆ సర్వే నంబర్లను ఈ-కర్షక్ వెబ్ లాగిన్‌లో అప్‌డేట్ చేసుకుంటారు. అనంతరం ఈ-కర్షక్ మొబైల్ యాప్‌లో జియోఫెన్సింగ్ డౌన్‌లోడ్ చేసుకుని పంట నమోదు ప్రక్రియను ప్రారంభిస్తారు. ఒక సర్వే నంబర్‌కు వెళ్లినప్పుడు ఆ సర్వే నంబర్ జియో కో ఆర్డినేట్స్ ఓపెన్ అవుతాయి. సర్వే నిమిత్తం వ్యవసాయ సహాయకులు క్షేత్ర స్థాయికి వెళ్తేనే యాప్ ఓపెన్ అవుతుంది. పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేయగానే అప్పుడు సర్వే నంబరు ఎరుపు రంగు నుంచి పసుపు రంగుకు మారుతుంది. అప్పుడు మాత్రమే వివరాలు నమోదైనట్లుగా పరిగణించడం జరుగుతుంది.

ఉపయోగాలు ఇవీ..

- ఈ క్రాప్ నమోదు ఆధారంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందవచ్చు
- వైఎస్ఆర్ సున్నా వడ్డీకి అర్హత సాధించవచ్చు
- రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండా ఉచిత పంటల బీమా పొందవచ్చు
- ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం జరిగినపుడు పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) పొందవచ్చు
- ధరలు పడిపోయినపుడు కనీస మద్దతు ధరలతో వ్యవసాయ ఉత్పత్తులను రైతుభరోసా కేంద్రాల ద్వారా అమ్ముకోవచ్చు.



ఈ క్రాప్ నమోదుతో ధైర్యం

దొరకొట్టాలకు చెందిన ఈ రైతు పేరు ధర్మారెడ్డి. ఇతను తనుకున్న సుమారు 12 ఎకరాల్లో గత సంవత్సరం ఖరీఫ్‌లో వరి పంట సాగు చేశాడు. వాతవరణం అనుకూలించి పంట ఏపుగా పెరిగినా కోతల సమయంలో సరైన దిగుబడి రాలేదు. అయితే ఈ - క్రాప్ నమోదు కావడంతో ఒక్క రూపాయి కూడా ఇన్సూరెన్స్ చెల్లించకుండానే వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ. 65 వేలు అందింది. ఈ ప్రభుత్వం పారదర్శకంగా చేపడుతున్న ఈ-క్రాప్‌తో ధైర్యం వచ్చిందని రైతు ధీమా వ్యక్తం చేస్తున్నాడు.

జిల్లాలో సబ్‌డివిజన్ల వారీగా ఈ క్రాప్ నమోదు ఇలా	
డివిజన్	ఈ-క్రాప్ నమోదు
ఆళ్లగడ్డ	83,226
డోన్	1,33,698
కోవెలకుంట్ల	55,150
నందికొట్కూరు	68,445
నంద్యాల	1,07,635
ఆత్మకూరు	7,3410

పొరపాట్లకు తావు లేకుండా..

ఈ ఏడాది పంటల నమోదులో నకిలీలకు, పొరపాట్లకు తావు లేకుండా వ్యవసాయ, రెవెన్యూ శాఖలు పర్యవేక్షించారు. గ్రామస్థాయిలో ఆర్బీకే ఇన్‌చార్జ్‌లు పంటలను నమోదు చేయగా ఈ డేటాను వీఆర్వోలు ధ్రువీకరించారు. ఆ తరువాత మండల వ్యవసాయాధికారి లాగిన్‌కు, అక్కడి నుంచి తహసీల్దార్ లాగిన్‌కు వివరాలు వెళ్లాయి. వెబ్‌ల్యాండ్ డేటాను ప్రామాణికంగా తీసుకోవడంతో పొరపాట్లకు తావు లేకుండా ఉండటంతో పాటు నకిలీల నమోదుకు ఏమాత్రం తావు లేకుండా ఉండేందుకు అవకాశం ఏర్పడింది. ఈ-కర్షక్ యాప్‌కు ఆర్బీకేలు, రెవెన్యూ గ్రామాలను మ్యాపింగ్ చేశారు. యాప్‌లో రైతు ఆధార్ నంబరు నమోదు చేస్తే భూమి వివరాలు ప్రదర్శితమవుతాయి. సాగు వివరాలు నమోదు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పంట ఫొటో తీసి యాప్‌లోకి అప్‌లోడ్ చేశారు. సీసీఆర్సీ కార్డులు పొందిన సాగుదారుల వివరాలు కూడా యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

రైతుకు ఎంతో మేలు



ఈ - క్రాప్, ఈ - కేవైసీ నమోదు చేయించుకోవడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు పూర్తయింది. సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ఈ-పంట జాబితాలను ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అభ్యంతరాల పరిశీలన తర్వాత ఆర్బీకేల్లో తుది జాబితా ప్రదర్శించడం జరుగుతుంది. పథకాల లబ్ధి పొందాలంటే ఈ-క్రాప్ డేటా తప్పనిసరి. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– మోహన్‌రావు – జిల్లా వ్యవసాయాధికారి



నేడు.. బ్రిడ్జిని ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

బ్రిడ్జి నిర్మించి మాట నిలబెట్టుకున్నాం

- కౌలూరు దళిత కాలనీ వాసులకు తీరిన ఆఖరి మజిలీ కష్టాలు
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

పాణ్యం: కౌలూరు సమీపంలోని వాగుపై రూ.25లక్షలతో బ్రిడ్జిని నిర్మించి మాట నిలబెట్టుకున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. జుర్రాగుపై నిర్మించిన బ్రిడ్జిని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2019కి ముందు గ్రామంలో దళితులు ఎవరైనా చనిపోతే వారికి అంత్యక్రియలు చేయాలంటే జుర్రాగు దాటాల్సి వచ్చేదన్నారు. వాగు ప్రవహిస్తున్న సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, సమస్యను పరిష్కరించాలని టీడీపీ హయాంలో దళితులు పోరాటం చేశారన్నారు. అప్పట్లో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి సాక్షాత్తు కలెక్టర్ వచ్చి పరిశీలించారని, అయినా ఫలితం లేకుండాపోయిందన్నారు. ఈ సమస్యకు తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే కాలనీలో ప్రజలకు మాట ఇచ్చానని, రూ.25 లక్షలతో బ్రిడ్జి నిర్మించి మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. గతంలో చనిపోయిన వ్యక్తికి ఘనంగా అంత్యక్రియలు చేయలేని దుస్థితి ఉండేదన్నారు. అలాంటి దుర్భర పరిస్థితులనుంచి నేడు గట్టెక్కారన్నారు. దళిత కాలనీ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నె కరుణాకర్, బాలస్వామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మహానంది రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మండల ఇంజినీరు మహబూబ్‌బాషా, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి, రాజన్న, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నాడు.. బ్రిడ్జి లేకపోవడంతో మృతదేహాన్ని మోసుకుని వాగు దాటుతున్న దళితులు

కాబోయే అమ్మకు సర్కారు సారె



పేదల ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. పుట్టబోయే బిడ్డ నుంచి వృద్ధురాలి వరకు పల్లె ముంగిటకే వైద్య సేవలు అందుతుండటంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం డి.వనిపెంట గ్రామంలో నిర్వహించిన శిబిరంలో వైద్యాధికారిణులు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు గర్భిణులకు సీమంతం చేసి సారెతో పాటు సమీకృత పౌష్టికాహారాన్ని అందజేశారు. పండంటి బిడ్డ పుట్టాలని ఆశీర్వదించారు.

– చాగలమర్రి

సీఎం చొరవతోనే అభివృద్ధి పథంలో ఆర్టీసీ

- ఎమ్మెల్యే శిల్పా రవి, ఎంపీ పోచా



జెండా ఊపి బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు తదితరులు

నంద్యాలటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతోనే ఆర్టీసీ అభివృద్ధి పథంలో పరిగెడుతుందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి అన్నారు. గురువారం నంద్యాల ఆర్టీసీ డిపోలో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించిన కార్గో కార్యాలయాన్ని ఎమ్మెల్యే, ఎంపీతో పాటు ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఆర్టీసీ కడప జోన్ 4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వేంకటేశ్వరరావు తదితరులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు జీపీఎస్ పెన్షన్ విధానం కూడా అమలు చేయాలని నిర్ణయం తీసుకుని ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారన్నారు. డిపోలో నూతనంగా నిర్మించిన కార్గో కార్యాలయం వల్ల వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించే అవకాశం ఉందన్నారు. అనంతరం నంద్యాల నుంచి హైదరాబాద్ (బీహెచ్‌ఈఎల్)కు నూతన స్లీపర్ నాన్ ఏసీ సర్వీసును వారు జెండా ఊపి ప్రారంభించారు. ప్రయాణికులకు అందుబాటు ధరలోనే స్లీపర్ సర్వీసును ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు, డిపో మేనేజర్ గంగాధరరావు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి, స్టేషన్ మేనేజర్ బాషా పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు..

నంద్యాల ఆర్టీసీ డిపోలో సెప్టెంబర్ – 2023 నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఆర్టీసీ కడప జోన్ 4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వేంకటేశ్వర రావు అభినందించారు. గురువారం డిపో ఆవరణలో ఉత్తమ కండెక్టర్లు ఎస్‌ఏ బాష, కే రాజు, శేషన్న, ఇబ్రహీం, దశతగిరి, డ్రైవర్లు, కేజీవీ రెడ్డి, రాముడు, వలి, వెంకటేశ్వర్లు, మాచర్లను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

కాణిపాకం వినాయకుడికి మహానందీశ్వరుడి పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలతో కాణిపాకం చేరిన మహానంది ఈఓ, చైర్మన్లు

మహానంది: కాణిపాకం దేవస్థానంలో కొనసాగుతున్న శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయకుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానంది దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. మహానంది దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్తల ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మలు గురువారం కాణిపాకం చేరుకుని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా కాణిపాకం ఈఓ వెంకటేశు, ధర్మకర్తలకు పట్టువస్త్రాలు అందించారు.

హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు కోరారు. గురువారం ఆయన కలెక్టరేట్ సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం, ఆనంద నిలయం, బీసీ బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలోనే ... ఆయన ఆయా వసతి గృహాల్లోని సౌకర్యాలు పరిశీలించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆయా హాస్టళ్లలోని రిజిస్టర్లను కూడా పరిశీలించి ఏవైనా లోపాలు ఉంటే చర్యలు తీసుకునేందుకు అధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు.

నేడు శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు దేవస్థానం పరిపాలనా భవనంలో ధర్మకర్తల మండలి చైర్మన్‌రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించనున్నారు. సమావేశంలో శ్రీశైలమహాక్షేత్రం అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పనకు సంబంధించి పలు అంశాలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. ఈ మేరకు అధికారులు ఇప్పటికే పలు అంశాలపై అజెండాను సిద్ధం చేశారు. నూతన ఈఓగా డి.పెద్దిరాజు నియమితులైన అనంతరం మొదటిసారి ధర్మకర్తల మండలి సమావేశం జరుగుతుంది.

మల్లన్న దర్శనం మోక్షదాయకం



ప్రవచనాన్ని వినిపిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించినచో బుద్ధి, జ్ఞానం, ఐశ్వర్యం, మోక్షం లభిస్తాయని సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హిందూ ధర్మప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రవచన కార్యక్రమం ఐదవ రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రం సిద్ధులన్నిచ్చే మహాక్షేత్రమన్నారు. స్వామివార్ల ఆలయం సమీపంలోనే మల్లికాకుండం, మనోహరకుండం వంటి తీర్థాల మహిమల పురాణాలలో వర్ణించబడ్డాయని, పాతాళగంగలో అనేక మంది దేవతలు, తపస్సులు సాధన చేస్తారని, ఇది దివ్యతీర్థంగా పురాణాలు చెబుతున్నాయన్నారు. శ్రీశైలంలో ఎన్నో దివ్య తీర్థాలు ఉన్నాయని, ఇక్కడి ప్రతి అణువు మహిమాన్వితమేనని తెలిపారు. చంద్రవతి అనే భక్తురాలు శివుని అర్చించి స్వామివారికి మల్లికా మాలను సమర్పించిందని, ఆ మాలతో స్వామి అలంకరించబడి మల్లికార్జునుడయ్యారన్నారు. భక్తులను అనుగ్రహించిన క్షేత్రం శ్రీశైలమని, శ్రీస్వామిఅమ్మవార్ల వాత్సల్యం అడుగడుగునా కనబడే దివ్యధామమే శ్రీశైలమన్నారు. కార్యక్రమంలో ఈఓ డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు ప్రతిపాదనలు

● జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య

నంద్యాల: పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో భాగంగా 51 పోలింగ్ స్టేషన్ల లోకేషన్ మార్పుకు, 17 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు సమర్పించామని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 13 పోలింగ్ స్టేషన్లు, శ్రీశైలంలో 4, నందికొట్కూరులో 2, నంద్యాలలో 7, బనగానపల్లెలో 7, డోన్ నియోజకవర్గంలో 18 పోలింగ్ స్టేషన్ల లోకేషన్ మార్పుకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. అలాగే శ్రీశైలంలో ఒకటి, నందికొట్కూరులో 6, నంద్యాలలో 10 కొత్త పోలింగ్ స్టేషనులకు కూడా ప్రతిపాదనలు పంపామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. జిల్లా స్థాయిలో ప్రతి బుధవారం, నియోజకవర్గ స్థాయిలో ప్రతి మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారు సూచించిన సలహాలు, ఆక్షేపణలను పరిగణలోకి తీసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయానికి సమర్పించామని పేర్కొన్నారు.



ఇంటి ముందు మంచినీటి కుళాయి



విద్యుత్ మీటర్



కనుల ముందు కలల సౌధం

కల సాకారం

పేద, మధ్య తరగతి ఇళ్లల్లో పెద్దలందరూ కష్టపడితే కానీ కుటుంబం గడవని ఖరీదైన కాలమిది. జీవితమంతా కష్టపడి సంపాదించి కూడబెట్టినా సొంతింటి కల నెరవేర్చుకోలేరు. అలాంటి పరిస్థితుల్లో కనుల ముందు వారి కలల సౌధాలు ఆవిష్కృతమవుతున్నాయి. నవరత్నాల పథకాల్లో అందరికీ పక్కా ఇళ్లు పథకంతో జగనన్న కాలనీల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతున్నాయి. సకల సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రైవేటు వెంచర్‌కు దీటుగా రూపుదిద్దుకుంటున్న నందికొట్కూరు శివారులోని జగనన్న కాలనీని చూస్తే వావ్ అనాల్సిందే. ఇళ్లతో పాటు రహదారి, మంచినీటి పైప్‌లైన్, విద్యుత్‌తో పాటు 'రారండోయ్ మా కాలనీ చూడండి' ఆహ్వానం పలికేలా ఆర్చ్‌ని సైతం నిర్మిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



నందికొట్కూరు జగనన్న కాలనీలో శరవేగంగా నిర్మితమవుతున్న ఇళ్లు



వెలుగులు పంచే ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు



అంతర్గత రహదారులు



నీటి ట్యాంక్



నిర్మాణ దశలో కాలనీ ఆర్చ్

క్లుప్తంగా

దీర్ఘకాలిక సెలవుపై ముగ్గురు సర్పంచ్‌లు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలోని మూడు గ్రామాల సర్పంచ్‌లు అనారోగ్య కారణాల దృష్ట్యా దీర్ఘకాల సెలవు పెట్టారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని చేరుకుని సెలవు పత్రాలను ఎంపీడీఓ సయ్యదున్నీసాకు అందజేశారు. మండలంలోని లింగాల, చిన్నకొప్పెర్ల, వల్లంపాడు గ్రామాల సర్పంచ్‌లు వెంకటలక్ష్మమ్మ, విజయలక్ష్మి, ఓబుళపతిరెడ్డి తమ పదవీ కాలానికి ఆరు నెలలు పాటు సెలవు పెడుతున్నట్లు ప్రకటించారు. మెడికల్ సర్టిఫికెట్లతో కూడిన తీర్మాన పత్రాలను ఎంపీడీఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సర్పంచ్‌ల సెలవు నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి తర్వాతి కార్యచరణ రూపొందిస్తామని వెల్లడించారు.

వైద్య కళాశాలలో అడ్మిషన్లు పూర్తి

నంద్యాలటౌన్: నంద్యాలలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలో పూర్తిస్థాయిలో విద్యార్థులు చేరినట్లు కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య కళాశాలకు కేటాయించిన 150 వైద్య సీట్లకు గాను మూడు విడతల కౌన్సెలింగ్ పూర్తయ్యి 150 మంది విద్యార్థులు చేరారన్నారు. దీంతో కళాశాలలో కేటాయించిన అన్ని సీట్లు భర్తీ అయ్యాయన్నారు. కళాశాలలో ఇప్పటికే తరగతులు ప్రారంభం అయ్యాయని, హాస్టల్‌లో చేరిన విద్యార్థిని, విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించామన్నారు.

వ్యక్తి బలవన్మరణం



మృతి చెందిన రాంబాబు

కోవెలకుంట్ల: సొదరదిన్నె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గురువారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల రాంబాబు(50) తనకున్న పొలంతోపాటు మరి కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య దస్తగిరమ్మ, కుమారులు పెద్ద దస్తగిరి, చిన్న దస్తగిరి గ్రామంలో జరుగుతున్న ఓ ఫంక్షన్‌కు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతుండటంతో కిందకు దించి కోవెలకుంట్ల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతుని భార్య దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడి కారు ఢీకొని వ్యక్తి మృతి

పాణ్యం: టీడీపీ నాయకుడి కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. పాణ్యం గ్రామానికి చెందిన బలపనూరు ఉసేన్ సాహెబ్(70) బుధవారం మధ్యాహ్నం పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోబహిర్భూమికి వెళ్తున్నారు. ఇదే సమయంలో మద్దూరు గ్రామానికి చెందిన టీడీపీ మండల నాయకుడు చెందిన ఏపీ 39ఆర్‌ఎల్ 2424 నంబర్ గల కారు రివర్స్‌లో వచ్చి ఢీకొట్టింది. ఉసేన్‌సాహెబ్‌కు గాయాలు కావడంతో శాంతిరాం ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుమారుడు షేక్ షంషీర్ ఉసేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతుడికి భార్య మెహరీన్ , కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు సిటీ: సహిత విద్యా వనరుల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా గురువారం సమగ్ర శిక్ష కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. మొత్తం 279 మంది అభ్యర్థులకుగాను మొదటి రోజున 66 మంది ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మిగిలిన వారి సర్టిఫికెట్లను నేడు, రేపు పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

12 కేంద్రాల్లో ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్ష

● నేటి నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

కర్నూలు: రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్‌ఐ ఉద్యోగాల నియామక ప్రక్రియలో భాగంగా దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఈనెల 14, 15 తేదీలలో కర్నూలులో 12 కేంద్రాల్లో రాత పరీక్ష నిర్వహించనున్నారు. 7,644 మంది పురుషులు, 877 మంది మహిళా అభ్యర్థులు కలిపి మొత్తం 8,521 మంది హాజరుకానున్నారు. ఈనెల 6 నుంచి 12వ తేదీ లోపు slprb.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్‌సింగ్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నా రు. సమస్యలు తలెత్తితే 9441450639, 9100203323 సంప్రదించాలన్నారు.

సన్న జీవాల పెంపకానికి రుణాలు

● జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య

కర్నూలు(అగ్రికల్చర్): గొర్రెలు, మేకలతో పాటు కోళ్లు, పందుల పెంపకాన్ని ప్రభుత్వం జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ నిధులతో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ఈ కార్యక్రమం 2025–26 వరకు అమలులో ఉంటుంది. గురువారం జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశాల మేరకు జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న ప్రత్యేక అవగాహన సదుస్సు ఏర్పాటు చేశామన్నారు. ప్రాథమిక గొర్రెల పెంపకందారుల చైర్మన్‌లు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, సభ్యులు, మండల, ఆర్‌బీకే స్థాయి వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌లు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్, సభ్యులు తదితరులకు రుణాల పంపిణీకి సంబంధించి మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కోడుమూరు రోడ్డులోని పుష్పరాజ్ ఫంక్షన్ హాల్‌లో ఈ సదస్సు ఏర్పాటవుతుందన్నారు. రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణాలకు సబ్సిడీ 50 శాతం వరకు ఉంటుందన్నారు. రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్వారీల్లో కార్మికుల భద్రతకు చర్యలు

కర్నూలు (న్యూసిటీ): క్వారీల్లో కార్మికుల భద్రతకు చర్యలు చేపట్టాలని యజమానులను జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ ఆదేశించారు. వెల్దుర్తి మండలంలోని సర్పారాజాపురం, ప్యాపిలి మండలంలోని చంద్రపల్లి గ్రామాల్లో ఉన్న స్టేటెడ్ క్వారీలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా స్టేటెడ్ క్వారీల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. క్వారీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి నిబంధనలు పాటించాలని సూచించారు. అనుమతికి మించి తవ్వితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చంద్రపల్లి గ్రామంలో లైన్ కంకర క్వారీ పరిశీలించామని, క్వారీ మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక తయారు చేసి పంపామని తెలిపారు. అలాగే డోన్ మండలంలోని ధర్మవరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వెంకటేశ్వర మినరల్ ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీ యజమాని వెంకటేశ్వరరెడ్డి ఒమాన్ దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న సున్నపురాయి ఖనిజ నిల్వను పరిశీలించామని చెప్పారు. ఆయన వెంట విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.



సర్పారాజాపురంలో స్టేటెడ్ క్వారీని పరిశీలిస్తున్న డీడీ రాజశేఖర్ తదితరులు

నంద్యాలలో జీవీ మాల్ ప్రారంభం

● సందడి చేసిన సినీనటి అనసూయ



జీవీ మాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రారెడ్డి



అభిమానులకు అభివాదం చేస్తున్న అనసూయ

నంద్యాల(సిటీ): నంద్యాల శ్రీనివాసనగర్‌లో జీవీ మాల్‌ను సినీనటి అనసూయ భరద్వాజ్ గురువారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన అనసూయ భరద్వాజ్ మాట్లాడుతూ నంద్యాల పట్టణానికి జీవీ మాల్ రావడం హర్షనీయమన్నారు. అన్ని రకాల వస్త్రాలకు సంబంధించి వెరైటీలు సరసమైన ధరలకు లభిస్తున్నాయన్నారు. అత్యాధునిక వస్త్ర కలెక్షన్లకు నిలయంగా ఉన్న మాల్‌లో అన్ని రకాల పట్టు, రెగ్యులర్ వేర్‌కు స్త్రీ, పురుషులతో పాటు చిన్నారులకు సంబంధించి చాలా వెరైటీలు ఈ షాపింగ్ మాల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లాంటి మహానగరాల్లో ఉండే జీవీ షాపింగ్ మాల్ రావడంతో పట్టణంలో మరింత మన్నికైన వస్త్రాలు సరసమైన ధరకే లభిస్తాయన్నారు. మాల్ అధినేతలు గుర్రం ఉమా మహేశ్వరరావు, గుర్రం వాసు, జనార్దన్ మాట్లాడుతూ వినియోగదారులకు మార్కెట్ ధరతో పోల్చితే జీవీ మాల్ ధరలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. సినీనటి అనసూయను చూసేందుకు పట్టణవాసులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు డీఎస్. హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

● గత పాలనకు.. ప్రస్తుత పాలనకు తేడాను తెలియజేయండి
● జగనన్నే మళ్లీ రావాల్సిన అవసరముందని చెప్పండి
● వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి. చిత్రంలో మేయర్ బీవై రామయ్య తదితరులు



హాజరైన గృహసారథులు, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు మేయర్ బీవై రామయ్య సూచించారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే స్వగృహంలో గృహసారథులు, కన్వీనర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన 'ఏపీకి జగనే సీఎం ఎందుకు కావాలి' కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, వీటి వల్ల చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లాలని, ఏ హోదాలో ఉన్న వారు అందుకు తగ్గట్లు ప్రణాళిక సిద్ధం చేసుకొని పార్టీ సూచించిన బాధ్యతలు తప్పనిసరిగా నిర్వర్తించాలని సూచించారు. పాదయాత్రలో జగనన్న ఇచ్చి హామీలను 95 శాతం అమలు చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కుమ్మక్కు రాజకీయాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న జగనే మరోసారి ఏపీకి అవసరమని ప్రజలకు వివరించాలన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలన వచ్చిందన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సాగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి, ఓర్వకల్లు, కల్లూరు మండలాల ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్ గౌడ్, ఆల ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రేణుక, డీపీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాల అధ్యక్షులు చెన్నారెడ్డి, ఈశ్వరయ్య, కల్లూరు అర్బన్ క్లస్టర్–1 అధ్యక్షుడు భీమ శంకర్‌రెడ్డి, క్లస్టర్–2 అధ్యక్షుడు (కార్పొరేటర్) శ్రీనివాసులు, మండలాల జేసీఎస్ కన్వీనర్లు హనుమంతురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, లోటర్ బాషా, కేశవ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.